జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 69 | శుక్రవారం 1 ఆగస్టు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

## సుంకాలు గమనిస్తున్నాం.. : భారత్

:జూలై 31 (సందేశం టైమ్స్):అమెరికా సుంకాలపై భారత్ స్పందించింది. అమెరికా విధించిన సుంకాల ప్రభావం ఏ మేరకు ఉంటుందనేదానిపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపింది. ఈ వ్యవహారంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. రైతులు, వ్యాపారవేత్తలతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్రం చెప్పుకొచ్చింది.



కొద్దిసేపటికే పాకిస్థాన్‌తో.

భారత్‌పై సుంకాలు విధించిన కాసేపటికే డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్‌కు శత్రుదేశమైన పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ట్రంప్ ప్రకటించారు. పాక్‌లో భారీ చమురు నిల్వల అభివృద్ధికి ఒప్పందం కుదిరినట్టు ప్రకటనలో చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో పాకిస్థాన్ నుంచి కూడా భారత దేశం చమురును కొనుకునే అవకాశం ఉంటుందని ట్రంప్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

భారత్‌పై మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వక్రబుద్ధి ప్రదర్శించారు. భారత్‌పై 25 శాతం సుంకాలు విధిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసిన ట్రంప్ భారత్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. రష్యా నుంచి భారత్ భారీగా ఆయుధాలు కొనుగోలు చేసిందని ఆరోపించారు. ఇరాన్ చమురు ఉత్పత్తులను భారత కంపెనీలు మార్కెటింగ్ చేస్తున్నాయని తెలిపారు.

రష్యాతో భారత్ ఏ వ్యాపారం చేసుకున్నా తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై దాడులు ఆపాలని రష్యాకు అన్ని దేశాలు చెబుతుంటే.. యుద్ధ సమయంలో కూడా భారత్, చైనా మాత్రం రష్యా నుంచి చమురు కొంటున్నాయని విమర్శించారు. భారత్‌పై ప్రకటించిన 25 శాతం సుంకాలు రేపటి(ఆగస్టు 1) నుంచి అమల్లోకి రానున్నాయి

## తెలంగాణ సర్కారుకు కాళేశ్వరం కమిషన్ నివేదిక



హైదరాబాద్ బ్యూరో :సందేశం టైమ్స్: కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో 650 పేజీలతో కూడిన తుది నివేదిక రెండు సీల్డ్ కవర్లల్లో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు చైర్మన్ పిసి ఘోష్ గురువారం అందజేశారు. ఆయన ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె రామకృష్ణారావుకు ఇవ్వడంతో ఈ నివేదికను సిఎస్ కార్యాలయంలోని లాకర్‌లో భద్రపరిచినట్టు తెలిసింది. పిసి ఘోష్ నివేదికకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన తర్వాత పలువురు అధికారులు, గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన పెద్దలపై చట్ట పరమైన చర్యలుంటాయని తెలిసింది. ఇదిలావుండగా గత బిఆర్ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల్లో భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ కోసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## బీఆర్ఎస్‌కు చెంపపెట్టు



న్యూఢిల్లీ/హైదరాబాద్, :జూలై 31 (సందేశం టైమ్స్): తెలంగాణలో ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ పార్టీకి చెంపపెట్టని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం అనర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ నేతలు పగటి కలులు కన్నారని, వారి కలలన్నీ కల్లలయ్యాయని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్‌కు మాత్రమే నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. స్పీకర్ నిర్ణయం కోసం వేచి చూడాల్సిందేనని చెప్పారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. ఉప ఎన్నికలొస్తే సిద్ధంగా ఉన్నామని, తప్పక గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ నేతలకు చెంపపెట్టు అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతల మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. సీఎల్పీ కార్యాలయంలో మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై హరీశ్, కేటీఆర్‌లకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ నాయకులు సంబరపడుతున్నారని మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ 2014లో టీడీపీ తరఫున గెలిచి, బీఆర్ఎసలో చేరారని.. అలాంటి వ్యక్తి ఇప్పుడు ఫిరాయింపులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని చెప్పారు.

## దేవాదాయశాఖలో ఈ ఆఫీసు సేవలు షురూ..

హైదరాబాద్, :జూలై 31 (సందేశం టైమ్స్): రాష్ట్ర దేవాదాయశాఖలో ఈ–ఆఫీసు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఆ శాఖ మంత్రి కొండా సురేఖ.. దేవాదాయశాఖ కమిషనరేట్‌లో గురువారం లాంఛనంగా ప్రారంభిస్తూ.. తమశాఖలో చేపట్టిన సంస్కరణలు గొప్ప ముందడుగు అని అభివర్ణించారు. ఈ–ఆఫీస్ ద్వారా త్వరితగతిన ఫైల్లు క్లియర్ కావడంతో అవి దొంగతనానికి గురి కావడం గానీ, అగ్ని ప్రమాదంలో కాలి పోవడం గానీ, మాయం కావడం గానీ ఉండదన్నారు. ఈ–ఆఫీసు ప్రారంభోత్సవం ద్వారా ఒక కారుణ్య నియామక ప్రక్రియ పూర్తి చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక దేవాదాయ ధర్మాదాయ బిల్లును రూపొందించి అసెంబ్లీలో ప్రవేశ పెడతామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. అర్చక ఉద్యోగ



జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు గురువారం ఆమెను కలిసి ఆశీర్వదించారు. అర్చకులకు పదోన్నతుల కల్పనలో జాప్యం జరుగుతున్నదని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ అంశాన్ని శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే అర్చక ఆగమ పరీక్షలు నిర్వహిస్తామని అర్చక ఉద్యోగ జేఏసీ ప్రతినిధులకు మంత్రి సురేఖ హామీ ఇచ్చారు.

## శ్రీశైలానికి పోటెత్తుతున్న వరద



హైదరాబాద్/గద్వాల/నాగార్జునసాగర్, :జూలై 31 (సందేశం టైమ్స్): కృష్ణా బేసిన్‌లోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3.17 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 3.18 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 885 అడుగులు (215.80 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 882.70 అడుగుల (202.96టీఎంసీల) మేర నీరు ఉంది. కృష్ణా బేసిన్‌లో ఆల్మట్టి నుంచి పులిచింతల దాకా ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారాయి. ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.52లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... ఔట్‌ఫ్లో 1.40లక్షల క్యూసెక్కులుగా ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.35లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే... ఔట్‌ఫ్లో 1.08లక్షల క్యూసెక్కులుగా రికార్డయింది. జూరాలకు 2.01లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా...జలవిద్యుదుత్పత్తి, గేట్లు ఎత్తడం ద్వారా 2.08 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెడుతున్నారు. తుంగభద్రకు 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 32వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 2.82లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 2.43లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. పులిచింతలకు 2.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... 2.04లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.

## ధాన్యం సేకరణ తర్వాత తనిఖీలు చేపట్టాలి



:జూలై 31 (సందేశం టైమ్స్):ప్రతి సీజన్ ముగిసిన వెంటనే ధాన్యం నిల్వలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భౌతిక తనిఖీలు(ఫిజికల్ వెరిఫికేషన్) చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు గురువారం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎసవోపీ)ను కేంద్ర వినియోగదారులు, ఆహార పంపిణీ శాఖ జారీ చేసింది. ఏ సీజన్‌లో అయినా ధాన్యం సేకరణ ముగిసిన వెంటనే భౌతిక తనిఖీలు నిర్వహించాలని, 30 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఒకవేళ నిల్వలు గుట్టలుగా ఉంటే... వాటిని 3 రోజుల్లో క్రమబద్ధీకరించాలని, లేకపోతే వాటిని నిల్వలుగా పరిగణించబోమని స్పష్టం చేసింది. ధాన్యం మర ఆడించడానికి అదనపు గడువు పొడిగించాలని కోరే రాష్ట్రాలు... ముందుగా మిగిలిన నిల్వలపై కనీసం 10 శాతం మిల్లుల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని సూచించింది.

## ఉప ఎన్నికలొస్తాయి సిద్ధం కండి



%హైదరాబాద్, చేర్యాల, :జూలై 31 (సందేశం టైమ్స్): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాంటూ సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సుప్రీం తీర్పు కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపదెబ్బ అని వ్యాఖ్యానించాయి. రాష్ట్రంలోని పది నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు వస్తాయని, ఆ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఓ ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేసిన కేటీఆర్.. కొందరు ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన ప్రజాస్వామ్య వ్యవస్థ నాశనం కాదని సుప్రీం తీర్పు నిరూపించిందని పేర్కొన్నారు. స్పీకర్ పదవిని అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ చేసిన రాజ్యాంగ వ్యతిరేక ఫిరాయింపుల రాజకీయానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ అని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు విధించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో రానున్న మూడు నెలల్లో 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని భావిస్తున్నామన్నారు. కాగా, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన నిజాయితీని నిరూపించుకోవాలని కేటీఆర్ ఈ సందర్భంగా కోరారు.

# సంపాదకీయం

## బీఈడీ అభ్యర్థులకు అనాదిగా అన్యాయం

'దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుంది' అని కొఠారి కమిషన్ చెప్పింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం, విద్యాశాఖ అనుసరిస్తున్న విధానంతో అటు విద్యార్థుల, ఇటు బీఈడీ అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. డీఈడీ కోర్సు పూర్తి చేసి, డీఎస్సీ ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి కొన్నేళ్లకు ప్రభుత్వం ప్రమోషన్లు కల్పిస్తోంది. వారిని ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)గా నియమిస్తోంది. మొత్తం పోస్టుల్లో ఈ ప్రమోషన్ల నియామకాలు ఏ పదో, ఇరవై శాతమో అయితే ఫర్వాలేదు. కానీ ఏకంగా డెబ్బై శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారానే పాఠశాల విద్యాశాఖ భర్తీ చేస్తోంది. తద్వారా ఉన్నత పాఠశాలల్లో నేరుగా భర్తీ అయ్యే ఎస్ఏ పోస్టుల సంఖ్య భారీగా పడిపోతోంది. దీంతో బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రతి డీఎస్సీలోనూ నిరాశే మిగులుతోంది. టెట్ వంటి ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో 90శాతం మార్కులు సాధించినా ఫలితం ఉండడం లేదు. 1998కి ముందు వరకు ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీల్లో సగం పోస్టులు డీఎస్సీతో నేరుగానూ, మిగతా సగం పోస్టులు ఎస్జీటీ (సెకెండరీ గ్రేడ్ టీచర్)లకు ఎస్ఏలుగా ఉద్యోగోన్నతి కల్పించడం ద్వారానూ భర్తీ చేసేవారు. అలాగే డీఎస్సీలో బీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ రాసుకునే అవకాశం కూడా ఉండేది. కానీ రాజకీయలబ్ధి కోసం నాటి నేతలు 1999లో జీవో%-%108, జీవో%-%505 (సవరణ) ద్వారా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా 30 శాతం, ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించడం ద్వారా 70శాతం భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇది బీఈడీ అభ్యర్థుల పాలిట శాపంగా పరిణమించింది. డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులకు పోటీపడే విషయంలోనూ మా బీఈడీ అభ్యర్థులకు అన్యాయమే జరుగుతోంది. ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులంటూ 2011లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీంతో బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ రాసుకునే అవకాశం కోల్పోయారు. కానీ 2018లో సుప్రీం మరొక తీర్పులో.. బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ రాసుకోవచ్చని, కానీ ఉద్యోగానికి ఎంపికైతే మాత్రం ఆరు నెలల బ్రిడ్జి కోర్సు చేయాలని తెలిపింది. 2023లో రాజస్థాన్‌లో డీఈడీ అభ్యర్థులు సుప్రీంను ఆశ్రయించగా... బీఈడీ అభ్యర్థులు డీఎస్సీలో ఎస్జీటీ పరీక్ష రాసే అవకాశాన్ని తొలగిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. దీంతో అటు నేరుగా పోస్టులు లేక, ఇటు ఎస్జీటీ రాసుకునే వెసులుబాటు లేకపోవడంతో బీఈడీ అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కేరళ రాష్ట్రంలో ఈ పరిస్థితి లేదు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 25 శాతం ప్రమోషన్లతోనూ, 75 శాతం నేరుగానూ అక్కడి ప్రభుత్వం భర్తీ చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కేంద్రీయ విద్యాలయాల్లోనూ 66.66 శాతం ప్రత్యక్షంగా (పరీక్షల ద్వారా), 33.33 శాతం ప్రమోషన్ల ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపడుతున్న విషయం రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి. మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత ఏడాది ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించాం. హైకోర్టును ఆశ్రయించాం. విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, విద్యా కమిషన్ చైర్మన్లతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదు. దీంతో మా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించాం. ఈ సందర్భంగా బీఈడీ అభ్యర్థుల ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నాం. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 80 శాతం నేరుగా, 20 శాతం మాత్రమే ప్రమోషన్లతో భర్తీ చేయాలి. ప్రభుత్వ, గురుకుల (జేఎల్, పీజీటీ, టీజీటీ), మోడల్ స్కూల్ (పీజీటీ, టీజీటీ), పీడీ, పీఈటీ వంటి ఉపాధ్యాయ ఖాళీలను నేరుగా ఒకే డీఎస్సీలో భర్తీ చేయాలి. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలి. మా డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 3 నుంచి 7 వరకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి హైదరాబాద్‌లోని (విద్యా కమిషన్) కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహించబోతున్నాం. ఈ యాత్రకు బీఈడీ అభ్యర్థులంతా కదలిరావాలి. ఈ ర్యాలీ అనంతరం కూడా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి.

# ఎంఈవో పోస్టుల్లో ఖాళీలకు ఇన్‌చార్జ్‌లు

### ప్రభుత్వ మేనేజ్‌మెంట్ టీచర్లకు అవకాశం
### వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



అమరావతి,జూలై 31 (సందేశం టైమ్స్): ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖ అధికారి పోస్టులకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ బుధవారం జోన్ 3, 4 ఆర్జేడీలు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లనే చాలావరకు ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అన్ని మేనేజ్‌మెంట్ల టీచర్లకు ఉమ్మడి సీనియారిటీ తీసుకుని భర్తీ చేయాల్సిన పోస్టులకు కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్ టీచర్లనే నియమించడాన్ని సంఘాలు తప్పుబట్టాయి. ఎంఈవో-1 పోస్టులను ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. జోన్-2 పరిధిలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను మాత్రమే ఎంఈవో-1లుగా భర్తీ చేసేందుకు సమాచారం సేకరించడాన్ని తప్పుబట్టింది. ఉమ్మడి సర్వీసు రూల్స్ జీవోలు 72, 73, 74 అమలు చేయాల్సిన అధికారులే సమన్యాయం పాటించకుండా పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో ఆరోపించారు. ఎంఈవోలకు బదిలీలు నిర్వహించి ఖాళీలను పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎంఈవో ఖాళీలను ప్రభుత్వ యాజమాన్య టీచర్లతోనే కాకుండా ఉమ్మడి సీనియారిటీతో భర్తీ చేయాలని పీఆర్‌టీయూ అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎంఈవో పోస్టులకు ఇన్‌చార్జ్ ఏర్పాట్లలో జడ్‌పీ హెచ్‌ఎంలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీటీఎఫ-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

# రెవెన్యూ అధికారులపై సర్కారు కొరడా

### పల్నాడులో 20 మందిపై తీవ్ర అభియోగాలు
### నగరి, కలసపాడు మండల అధికారులపై విచారణ
### భూకబ్జా, వెబ్‌ల్యాండ్ తప్పులపై తీవ్ర ఆగ్రహం




అమరావతి,జూలై 31 (సందేశం టైమ్స్): ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా కన్నెత్తిచూడని, కీలకమైన 'వెబ్‌ల్యాండ్'లో తప్పుడు ఎంట్రీలకు పాల్పడిన అధికారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ముఖ్యంగా పల్నాడుజిల్లా మాచర్ల, వెల్దుర్తి మండలాల్లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అదేవిధంగా నగరి తహసీల్దార్లపైనా చర్యలకు ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నగరి మండలంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఓ వ్యక్తి కబ్జా చేసినా తహసీల్దార్లు చర్యలు తీసుకోలేదు. వీరితోపాటు ఇతర అధికారులపైనా విచారణ చేపట్టాలని జయలక్ష్మి ఆదేశించారు. నగరి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. నగరిలో గతంలో తహసీల్దార్లుగా పనిచేసిన కె. వెంకటరమణ, కె. బాబు, గ్రామ రెవెన్యూ అధికారులు సదాశివ పిళ్లై, దేవదాసు తదితరులపై శాఖాపరమైన విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే వారిపై అభియోగాలు నమోదు అయ్యాయని.. వాటికి అనుగుణంగా విచారణ చేపట్టాలని జయలక్ష్మి పేర్కొన్నారు.

# తండ్రి చితికి తలకొరివి పెట్టిన కుమార్తె

సరుబుజ్జిలి, జూలై 31(టుడే విదుర): నందికొండ గ్రామంలో తం డ్రి చితికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెం దిన కూన సింహాచలం (65) కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈయ నకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు వైకుంఠరావు కూడా ఇటీవల ఇదే వ్యాధి బారినపడ్డాడు. ఈ క్రమంలో సింహాచలం మృతి చెందడంతో అంత్యక్రియలు చేసే స్థితిలో కుమారుడు లేకపోవడంతో చిన్న కుమార్తె అనురాధ (పురుషోత్తపురం) తండ్రి చితికి తలకొరివి పెట్టింది.

# 11 శాతం పొగాకుకే రూ.12 వేల ధర



-పెదనందిపాడు :జూలై 31 (సందేశం టైమ్స్): పొగాకు కొనుగోలును వేగవంతం చేయాలని, స్థానికంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో రైతుల వద్ద ఉన్న పొగాకును రైతుసంఘం నాయకులు పరిశీలించి రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కాకుమానులో ఏర్పాటుచేసిన పొగాకు కొనుగోలు కేంద్రం గోదాము నిండిపోవడంతో రెండ్రోజుల నుండి కొనుగోళ్లు ఆపేశామని, పక్కన ఉన్న గోదాములో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు తొలగించి, 4వ తేదీన కొనుగోళ్లను పున: ప్రారంభిస్తామని అధికారులు చెప్పినట్లు నాయకులు తెలిపారు. రామారావు మాట్లాడుతూ ఇప్పటివరకు కాకుమాను కొనుగోలు కేంద్రంలో 172 మంది రైతుల వద్ద నుండి 3,582 పొగాకు బేళ్లు కొన్నట్లు తెలిపారన్నారు. అందులో 328 బేళ్లు రూ.12 వేలు చొప్పున, 1,888 బేళ్లు రూ.9 వేలు చొప్పున, 1366 బేళ్లు రూ.6 వేలు చెప్పున రైతులకు ధర లభించిందన్నారు. తద్వారా 11 శాతం పొగాకుకు మాత్రమే 12 వేల ధర వచ్చినట్లు చెప్పారు. పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, మార్క్‌ఫెడ్ అధికారులు వివిధ సందర్భాల్లో చెప్పినా ఇంతవరకు పెట్టలేదని అన్నారు. ఎకరాకు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టిన రైతులు పొగాకు అమ్ముడుపోక, ఖరీఫ్ సీజన్ మొదలైన నేపథ్యంలో తిరిగి పంటలకు పెట్టుబడులు పెట్టుకోలేక సతమతమవుతున్నారని తెలిపారు. పెదనందిపాడుతోపాటు ప్రత్తిపాడులోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం త్వరగా కొనాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కె.వెంకటశివరావు, డి.రమేష్‌బాబు, ఎన్.రాజేంద్ర, జె.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నిండుకుండలా పులిచింతల



జూలై 31 (సందేశం టైమ్స్): ఎగువన నాగార్జునసాగర్ నుంచి వస్తున్న వరదతో పులిచింతల ప్రాజెక్టు నిండు కుండలా మారింది. 41.58 టీఎంసీల నీరు చేరడంతో 12 గేట్లను మూడు అడుగులకు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువనున్న ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 3,01,167 క్యూసెక్కులు ఉంది. గంట గంటకూ సాగర్ నుంచి ప్రవాహం పెరుగుతోందని పులిచింతల ప్రాజెక్టు డీఈ వెంకట్ తెలిపారు. జూలై ఆఖరుకే పులిచింతల ప్రాజెక్టు నిండటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీగా వరద వస్తుండటంతో ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను ఎత్తి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. నదీ తీరాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 94,679 క్యూసెక్కులు ఉందని, ఇది 3 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని తెలిపింది. కాగా.. శ్రీశైలం డ్యాంకు వరద పోటెత్తుతోంది. జూరాల, సుంకేసుల నుంచి 2,89,670 క్యూసెక్కుల వరద శ్రీశైలంలోకి వచ్చి చేరుతోంది. దీంతో 8 స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు 2,16,520 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 20 వేల క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 33,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30,643 క్యూసెక్కులు మొత్తం 3,02,478 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.80 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 2,82,364 క్యూసెక్కుల వరద చేరుతోంది. 26 గేట్ల ద్వారా 2,65,816 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# అంతా మా ఇష్టం..



- ఆరోగ్యశాఖ టెండర్లలో అధికారుల ఇష్టారాజ్యం
- ప్రసన్నం చేసుకున్న కంపెనీలకే అర్హత
- అన్ని అర్హతలున్న కంపెనీలు డిస్‌క్వాలిఫై గతంలో సజ్జల ఆప్తుడికి సెక్యూరిటీ టెండర్లు
- ఇప్పుడు శానిటేషన్ టెండర్లు కట్టబెట్టేలా స్కెచ్
- రఘురామ ఫిర్యాదు చేసిన కంపెనీకి ఓకే
- జగన్ కోటరీకే టెండర్లు కట్టబెడుతున్న వైనం

జూలై 31 (సందేశం టైమ్స్): **అన్ని అర్హతలు ఉన్నాయా.. నువ్వు పనికిరావు. నీకు అనుభవం ఉందా.. నీకు చాన్సేలేదు. నువ్వు జగన్ మనిషివా.. అయితే ఓకే. నిబంధనలు మాకు పట్టవు. మా టెండర్లు, మా ఇష్టం. టెండర్లలో పాల్గొంటేనే సరిపోదు. మమ్మల్ని ప్రసన్నం చేసుకోవడానికి ముడుపులతో మెప్పించాలి. అప్పుడే అర్హత కల్పిస్తాం. ఇదీ ఆరోగ్యశాఖ టెండర్ల వ్యవహారంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు.**

ఆస్పత్రుల్లో శానిటేషన్ పనులు నిర్వహించేందుకు పిలిచిన టెండర్ల వ్యవహారంలో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని అర్హతలున్న కంపెనీలను ఉద్దేశ పూర్వకంగా డిస్‌క్వాలిఫై చేసి, అర్హత లేని కంపెనీలనే క్వాలిఫై చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. శానిటేషన్ పనుల కోసం ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు మే నెలలో ఆరు జోన్లకు టెండర్లు ఆహ్వానించారు. ఈ టెండర్ ప్రక్రియలో మొత్తంగా 13 కంపెనీలు బిడ్లు దాఖలు చేశాయి. చివరికి వారం క్రితం.. అంటే టెండర్లు పిలిచిన రెండు నెలల తర్వాత టెక్నికల్ బిడ్లు తెరిచారు. టెక్నికల్ బిడ్‌లలో ఏడు కంపెనీలకు అర్హత కల్పించి, ఆరు కంపెనీలను డిస్‌క్వాలిఫై చేశారు. ముడుపులు మొత్తం అందిన తర్వాత టెక్నికల్ బిడ్లు తెరిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఇదే ఆరోగ్య శాఖలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.మొదటి నుంచి టెండర్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కీలక అధికారిని అకస్మాత్తుగా ఆ పని నుంచి తొలగించారు. ఉద్దేశ పూర్వకంగా కొన్ని కంపెనీలకు టెండర్లు కట్టబెట్టేందుకే ఇలా ఇష్టారాజ్యంగా మార్పు లు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో గుర్తింపు ఉండి, ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో శానిటేషన్ పనులు చేస్తున్న కంపెనీలను అధికారులు డిస్‌క్వాలిఫై చేశారు. అధికారులు క్వాలిఫై చేసిన కంపెనీల్లో నాలుగింటిపై తీవ్ర ఆరోపణలున్నాయి. ఇందులో ఒక కంపెనీ సజ్జలకు అత్యంత ఆప్తుడైన వ్యక్తిది కావడం గమనార్హం. అలానే వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును ఇబ్బంది పెట్టిన జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్‌కు సంబంధించిన కంపెనీకి టెక్నికల్ బిడ్‌లో అర్హత కల్పించడం చర్చనీయాంశమైంది. సదరు కంపెనీపై విచారణ చేయాలని డీఎంఈకి ఆర్‌ఆర్‌ఆర్ ప్రత్యేకంగా ఫిర్యాదు చేశారు. సాధారణంగా టెండర్లలో పాల్గొనే కంపెనీపై ఫిర్యాదులు వచ్చినా, అనుమానాలున్నా వెంటనే సదరు కంపెనీల నుంచి సమాధానం కోరాలి. ఏపీఎంఎసఐడీసీ అధికారులు అలాంటి నిబంధనలు ఏమీ పాటించ లేదు. ఫైనాన్షియల్ బిడ్ తెరవడానికి ఒక్కరోజు ముందు.. అభ్యంతరాలపై కేవలం వివరణ ఇచ్చి వెళ్లిపోండి అంటూ బుధవారం కంపెనీలకు లేఖలు పంపించారు. ఏపీఎంఎస్ఐడీసీ అడ్డగోలు నిర్ణయంపై కంపెనీలు కోర్టులను ఆశ్రయించేందుకు సిద్ధం అవుతున్నాయి.ప్రభుత్వం మారినా మాజీ సీఎం జగన్ కోటరీ కంపెనీల హవా మాత్రం తగ్గడం లేదు. ఆరోగ్యశాఖలో ఏ టెండర్ అయినా ఆ కంపెనీలకే దక్కుతున్నాయి. ఇప్పటికే విజయవాడలోని సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో టెండర్ లేకుండానే సీటీ స్కాన్ సేవలను జగన్ ఆప్తుడి కంపెనీకి అప్పగించేశారు. సెక్యూరిటీ టెండర్లు అలాగే కట్టబెట్టారు. ఇప్పుడు శానిటేషన్ టెండర్లు ఆ కోటరీ కంపెనీలకే కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సెక్యూరిటీ టెండర్లలో అర్హత లేకపోయినా సజ్జల రామకృష్ణారెడ్డికి అనుంగుడైన వ్యక్తికి జోన్–1 టెండర్ కట్టబెట్టారు. ఇప్పుడు శానిటేషన్ టెండర్లలో కూడా ఏదొక జోన్ ఇవ్వాలనే ప్లాన్‌లో భాగంగా ఓ కంపెనీకి అర్హత కల్పించారు. కానీ సదరు కంపెనీ చాలా డాక్యుమెంట్లు టెండర్ బిడ్‌లో దాఖలు చేయకపోయినా అధికారులు కళ్లు మూసుకుని ఆ కంపెనీకి అర్హత కల్పించారు. దీనిపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు.

## పెట్రోల్ బంకు పరిశీలన




కర్నూలు న్యూసిటీ, జూలై 31 (సందేశం టైమ్స్): 19వ వార్డు జొహరాపురం రోడ్డులో నగర పాలక సంస్థ, ఇండియన ఆయిల్ కార్పొరేషన సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోలు బంకు పనులను కమిషనర్ పి.విశ్వనాథ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక ఆధ్వర్యంలో త్వరలో మరో పెట్రోల్ పంప్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దామోదరం సంజీవయ్య పార్కులో సౌకార్య లపై స్థానికులను ఆరా తీశారు. ఆయన వెంట ఇనచార్జి ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన సూపర్‌వైజర్ నాగరాజు, డీఈఈ నరేష్, ఏఈ జనార్దన, శానిటరీ ఇన్సపెక్టర్లు ఉన్నారు.

## కూలి రేట్ల కోసం యజమానులకు ప్రతిపాదన నోటీసులు



పిడుగురాళ్ల :జూలై 31 (సందేశం టైమ్స్): పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సున్నం మిల్లు కార్మికులకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు కార్మికులు నాయకులు పల్వరైజర్స్ అసోసియేషన్ యాజమాన్యానికి కూలి రేట్లు పెంపుదల ప్రతిపాదన వివరాలతో కూడిన డిమాండ్ నోటీసును అందజేశారు. పుల్లారావు, గోపి, రమేష్‌కు ఈ పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకోసారి జరిగే కూలిరేట్లు ఒప్పందం ముగిసే సమయం దగ్గర పడుతున్న తరుణంలో పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు ప్రస్తుతం అమలవుతున్న రేట్లపై 50 శాతం పెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టపరమైన రమైన సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. పని ప్రదేశంలో కార్మికులకు తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు నిర్మించాలని, మాస్కులు, గ్లౌజులు వంటి భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.జయరాజు, యతిరాజుల శివయ్య, చిట్టిబోయిన గిరిబాబు, నల్లమేకల ఎలమంద, కాకర్ల సాంబయ్య, బత్తుల కొండలు, రామారావు, షేక్ కాసిం సాహెబ్, ఆదాయం సాహెబ్ పాల్గొన్నారు.

## ట్రావెల్ బస్సు ఢీకొని యువకుడు మృతి



జూలై 31 (సందేశం టైమ్స్): ఎస్ఆర్ పురం ట్రావెల్ బస్సు ట్రావెల్ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది పోలీసుల కథనం ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ సమీపంలో చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి నాయుడుపల్లి సమీపంలో ఎస్ఆర్ పురం మండలానికి చెందిన కొండపల్లి ఎస్సీ కాలనీకి లోకేష్ 24 ద్విచక్ర వాహనం పై స్వగ్రామం నుండి ఎస్ఆర్ పురం వెళ్తుండగా చిత్తూరు నుండి పల్లిపట్టి వైపు రాఘవేంద్ర ట్రావెల్స్ వస్తూ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## అడవి పనసకు భలే గిరాకీ



**ఏజెన్సీలో ఘాట్‌రోడ్డు పొడుగునా అమ్మకాలు**
**ఆశావహ ధరతో గిరి రైతులకు కాసుల పంట**

అనంతగిరి జూలై 31 (సందేశం టైమ్స్): గమ్మత్తైన రుచి, సువాసనతో నోరూరించే అడవి పనసకు భలే గిరాకీ లభిస్తోంది. ఏటా జూన్. జూలై. నెలలోనే అందుబాటులోకి వచ్చే పనస కాయలను అనంతగిరి, అరకు పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. అనంతగిరి ఘాట్ రోడ్డు డముకు, బొర్రా జంక్షన్, అనంతగిరి, తదితర ప్రాంతాల్లో గిరిజనులు రోడ్డుకు ఇరువైపులా విక్రయిస్తుంటారు. అయితే గత నెల తొలకరి సమయంలో ఒక పనస కాయ రూ. 50 నుంచి రూ. 150 ధర పలకగా, ఇప్పుడు రూ. 200 నుంచి రూ.250 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఘాట్‌రోడ్డు పొడుగునా పలుచోట్ల అడవి పనసపండ్లు, కాయలను పోగులుగా వేసి స్థానిక గిరిజనులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఘాట్‌రోడ్డు రక్షణ గోడపై పొందికగా అమర్చిన అడవి పనసకు ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది. అల్లూరి జిల్లాలో పర్యాటక అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు ఇక్కడ లభించే అటవీ, గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసి వెళుతుంటారు. అందులో భాగంగానే అరకు కాఫీకి విశేషమైన గిరాకీ ఉండగా, ఈ సీజన్‌లో పనస కాయలను అదే మాదిరిగా కొనుగోలు చేస్తుంటారు. అంతే కాకుండా మరి కొంతమంది రైతులు అనంతగిరి. దమ్ముకు. కాశిపట్నం. గుమ్మ కోట. వారపు సంతలకు అడవి పనస పండ్లను తీసుకెళ్లి విక్రయిస్తారు విశాఖ. విజయనగరం. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు తరలి వచ్చి ఏజెన్సీలో దొరికిన పనస పండ్లను పెద్దమొత్తంలో కొనుగోలు చేసి వాటిని మైదాన ప్రాంతాలకు తరలించి, మంచి లాభాలకు మారు అమ్మకాలు కూడా చేస్తున్నారు. మొత్తానికి ప్రస్తుతం ఏజెన్సీలో లభించే అడవి పనస పండ్లు అటు గిరిజన రైతులకు, ఇటు వ్యాపారులకు కాసులపంట పండిస్తుందంటే అతిశయోక్తి కాదు.

## చూడలేని సీసీలు..తూయలేని వే బ్రిడ్జ్‌లు





జూలై 31 (సందేశం టైమ్స్): ఇసుక అక్రమంగా బయటకు పోకుండా కాపాడతామంటూ గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి విభాగం (ఏపీఎండీసీ) బాగానే హడావుడి చేసింది. చూడలేని సీసీ కెమెరాలు... బరువు కాటా వెయ్యలేని వే బ్రిడ్జ్‌లతో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు 'ప్రయాస' పడింది. అక్రమంగా ఇసుకతో వాహనాలు వెళుతున్నా ఆపలేని చెక్‌పోస్టలు... విద్యుత్తు సరఫరా చెయ్యలేని సోలార్ యూనిట్‌లు... వీటన్నిటికీ మించి నిఘా పర్యవేక్షణ కోసం రాష్ట్రం మొత్తం మీద ఐదు వేలకుపైగా తాత్కాలిక సిబ్బంది నియామకం... ఇలా చేసిన ఏర్పాట్లేవీ దొంగలను పట్టలేదుగానీ కొత్త దోపిడీ పద్ధతులకు మాత్రం తలుపులు తెరిచాయి. నాసిరకం పరికరాలు కొని రూ.కోట్లు ఆనాటి నేతలు, ఏపీఎండీసీ ఎండీ స్థాయి అధికారి జేబులో వేసుకున్నట్టు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. అప్పుడు ఏపీఎండీసీ చేసిన పాపాలకు సాక్ష్యంగా ఇప్పుడు ఇసుక రీచ్‌లలో ఉన్న పరికరాలు తుప్పు పడుతున్నాయి. కెమెరాలు, సోలార్ పరికరాలు దొంగలపాలయ్యాయి. దొంగలు దోచిందిపోగా, మిగిలిన పరికరాలనయినా తర్వాత సద్వినియోగం చేశారా! అంటే అదీలేదు. సిబ్బందికోసం ఏర్పాటు చేసిన కంటైనర్ క్యాబిన్‌లు పాడయిపోతున్నాయి.గత ప్రభుత్వంలో తొలి సంవత్సరంపాటు ఏపీఎండీసీ కిందే ఇసుక రీచ్‌ల నిర్వహణ కొనసాగింది. ఆ తర్వాత ప్రైవేటు కంపెనీలకు ఆ బాధ్యతను అప్పగించారు. తన పరిధిలో ఉన్నప్పుడు సైతం ఒక్కరోజు కూడా ఇసుక రీచ్‌లను ఏపీఎండీసీ పర్యవేక్షించింది లేదు. అసలు ఒక్క కెమెరా కూడా అప్పట్లో పనిచేయలేదు. ఏర్పాటు చేసిన మూడు నెలల్లోనే నదిలోని వాటిని దొంగలు ఎత్తుకుపోయారు.

# ఇక బెజవాడ నుంచే నేరుగా హజ్‌యాత్ర



విజయవాడ సిటీ జూలై 31 (సందేశం టైమ్స్): రాష్ట్రంలోని ముస్లింలు సులువుగా, సునాయాసంగా పవిత్ర స్థలం మక్కాకు చేరుకునే అవకాశం ఏర్పడింది. నేరుగా మక్కాకు చేరుకునేందుకు వీలుగా దేశవ్యాప్తంగా ఎంబార్కేషన్ పాయింట్లు కలిగిన 17 అంతర్జాతీయ విమానశ్రయాల జాబితాలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం చోటు దక్కించుకుంది. ఇప్పుడు రాష్ట్రంలోనే ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటుతో హజ్‌యాత్ర చేసే ముస్లింలకు వేలాది రూపాయల డబ్బు, సమయం ఆదా కానున్నాయి. ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు పట్ల సీఎం చంద్రబాబుకు, మంత్రి ఫరూక్‌కు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, హజ్ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# 2న ఐదు కోట్ల మొక్కలకు అంకురార్పణ



పిడుగురాళ్ల,జూలై 31 (సందేశం టైమ్స్): ఐదు కోట్ల మొక్కలు పెంచేందుకు ఆగస్టు 2వ తేదీన శ్రీకారం చుడుతున్నామని ప్రభుత్వ పర్యావరణ సలహాదారు కొమెర అంకారావు తెలిపారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు జడ్పీ పాఠశాలలో ఆయన 'తో మాట్లాడుతూ....'ఆగస్టు 2న నల్లమల ఫారెస్టులో 15 కిలోమీటర్లు వాక్ రన్ చేయనున్నాం. కారంపూడి మండలం సింగరుట్ల నల్లమల ఫారెస్టు నుంచి గుత్తికొండ బిళం వరకు నడక కొనసాగిస్తూ...అడవిలో ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థపదార్థాలు తొలగింపుతో పాటు అటవీ ప్రాంతంలో మొక్కలు పెంచేందుకు విత్తన బాల్స్‌ను చల్లనున్నాం. జిల్లాలోని పర్యావరణ ప్రేమికులు, పాఠశాల విద్యార్థులు 15 కిలోమీటర్ల వాక్ రన్‌లో పాల్గొనవచ్చు. ప్రతి వారం ఓ మండలంలోని జడ్‌పీ పాఠశాలను సందర్శించి పర్యావరణ పెంపుపై అవగాహన కల్పించడంతో పాటు మనకు అందుబాటులో ఉన్న మొక్కల విశిష్టత, వివరాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం.' అని వివరించారు. మనచుట్టూ ఆరోగ్యానికి మేలు చేసే మొక్కలు ఎన్నో ఉన్నాయని, అవి ఏమిటో, ఎందుకు ఉపయోగిస్తారు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు అంకారావు తెలిపారు.

# ఆటో, లారీ ఢీకొని కూలీ మృతి



-ఏలూరు స్పోర్ట్స్ :జూలై 31 (సందేశం టైమ్స్): చేపలు పట్టేందుకు వెళ్తున్న కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను లారీ ఎదురుగా ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఒరిస్సాకు చెందిన ప్రదీప్ మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన కొందరు కూలీలు ఆటోలో మండవల్లి చేపల చెరువులలో చేపలు పట్టేందుకు బయలుదేరారు ఆటో సరిగ్గా ఏలూరు రూరల్ మండలం జాలిపూడి సమీపానికి చేరుకునేసరికి కైకలూరు నుండి విజయవాడ వైపు వెళ్తున్న ఐచర్ వ్యాన్ ఎదురుగా వచ్చి కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సందీప్ బల్సి 23 అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగే సమయంలో ఆటోలో దాదాపు పదిమంది ప్రయాణిస్తున్నారు. ఈ ఆటోలో ప్రయాణిస్తున్న పదిమందిలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గుమ్మిగూడిన స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఏలూరు సర్వే తరలించారు ప్రస్తుతం వీరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

# ప్రకాశం బ్యారేజీకి పోటెత్తుతున్న వరద

గుంటూరు జిల్లా ప్రతినిధి జూలై 31 (సందేశం టైమ్స్): కృష్ణా తీర ప్రాంతానికి ముంపు బెడద పొంచి ఉంది. ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం వస్తోంది. ఏకకాలంలో నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజి గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే పులిచింతల నుంచి 3 లక్షల నీరు దిగువకు విడుదల చేశారు. దీంతో దాచేపల్లి నుంచి రేపల్లే వరకు కృష్ణా పరివాహక ప్రాంతంలో వరద నీరు చేరుతుండటంతో పొలాలు, ఇళ్లుముంపునకు గురయ్యే ప్రమాదం నెలకొంది. ప్రకాశం బ్యారేజికి గురువారం ఉదయం 3 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉండటంతో జిల్లాలోని తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాలకు వరద నీరు రానుంది. పులిచింతల నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండటం వల్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ అధికారులు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల అధికారులకు సమాచారం అందించారు. సాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ప్రస్తుతం పులిచింతల నుంచి వచ్చిన నీరు వచ్చినట్టు విడుదల చేస్తుండటంతో బుధవారం ప్రకాశం బ్యారేజి గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజికి వస్తున్న గోదావరి జలాల విడుదలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే డెల్టా కాల్వలకు 10,159 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాత్రి 9 గంటలకు జలవనరుల శాఖ అధికారులు అందించిన సమాచారం ప్రకారం శ్రీశైలంకు ఈ సీజన్‌లో రికార్డు స్థాయి వరద వస్తోంది. ప్రస్తుతం 3,06,855 క్యూసెక్కులు వస్తుండగా 3,17,542 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్‌కు ప్రస్తుతం 2,82,124 క్యూసెక్కుల నీరు వస్తుండగా 3,11,424 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు ఎగువ నుంచి 2,97,665 క్యూసెక్కుల నీరు వస్తుండగా 3,24,870 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజికి విడుదల చేశారు. దీంతో ప్రకాశం బ్యారేజికి వరద పోటెత్తుతోంది. ఉదయం 3.24 లక్షల క్యూసెక్కుల నీరు ఒకేసారి వస్తే వెంటనే అన్ని గేట్లు పూర్తి స్థాయిలో ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు సముద్రంలోకి విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పులిచింతల నుంచి నీటి విడుదల ప్రవాహం భారీగా పెరిగితే ప్రకాశం బ్యారేజి ఎగువ, దిగువన పలు గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. పల్నాడు జిల్లాలోని దాచేపల్లి నుంచి అమరావతి వరకు, గుంటూరు జిల్లాలోని తుళ్లూరు నుంచి కొల్లిపర వరకు, బాపట్ల జిల్లాలోని కొల్లూరు నుంచి రేపల్లె వరకు మొత్తం 14 మండలాల పరిధిలో దాదాపు 50 లంక గ్రామాలకు ముంపు సమస్య ఏర్పడనుంది. ఇప్పటికే సాగర్‌కు ఉన్న 26 క్రస్టు గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు.

# బాలురే...కానీ, గంజాయికి బానిసలై...

**మద్యం తాగేందుకు రాలేదని ఇద్దరు బాలురపై దాడి**

**వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు**

**ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**సత్యసాయి జిల్లాలో ఘటన**



కదిరి అర్బన్, జూలై 31 (సందేశం టైమ్స్): వారు మైనర్లు....బాల్య వయస్సులోనే గంజాయికి బానిసలయ్యారు. అంతే కాదు, తోటి బాలురను మద్యం సేవించాలని ఒత్తిడి చేశారు. వారు వినలేదని గంజాయిమత్తులో క్రూరంగా దాడిచేశారు. దాడి దృశ్యాలను తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో ఉంచారు. ఇవి వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగి, దాడికి పాల్పడిన ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కాళసముద్రం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు ఇటీవల జరిగిన పీర్ల పండుగ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురను మద్యం తాగుదామని పిలిచారు. దానికి వారు నిరాకరించారు. దీంతో వారిపై ఆ ముగ్గురు కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు గ్రామ శివారులో గంజాయి సేవించారు. మత్తులో ఉండగా.. మద్యం సేవించేందుకు నిరాకరించిన ఇద్దరు బాలురు అటువైపు వెళుతూ కనిపించారు. ఇదే అదనుగా ఆ ముగ్గురు దాడికి దిగారు. 'మద్యం తాగడానికి పిలిస్తే రారా..?' అని కేకలు వేస్తూ చెప్పులు, చింతబర్రలతో చితకబాదారు. వదిలిపెట్టండి అని వేడుకున్నా కనికరించలేదు. ఓ వైపు దాడి చేస్తూ, మరోవైపు వీడియో చిత్రీకరించారు. సోషల్ మీడియాలో వీడియోలు చూసిన పోలీసులు స్పందించి, బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. కాగా, తమ కుమారుడు గంజాయి, మత్తుకు అలవాటుపడ్డాడని, పలుమార్లు మందలించినా దారికి రాలేదని దాడికి పాల్పడిన ఓ బాలుడి తండ్రి మీడియా ఎదుట వాపోయారు.

# కొన్ని రూట్లలో అచ్చంగా మహిళా కండక్టర్లు



ద్వారకా బస్‌స్టేషన్‌జూలై 31 (సందేశం టైమ్స్): మహిళా ప్రయాణికులు ఎక్కువగా ఉండే రూట్లలో మహిళా కండక్టర్లనే వినియోగించాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం అవకాశం కల్పించనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పుడు అన్ని రూట్లలోను మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగినా, కొన్ని రూట్లలో చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించినా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు. అలాంటి సందర్భాల్లో కండక్టర్లు మగవారైతే బస్సుల్లో ప్రయాణించే మహిళలు ఇబ్బందిపడే అవకాశం ఉంది. మహిళల మధ్య నుంచి ముందుకు, వెనక్కు తిరిగేందుకు మగ కండక్టర్లు కూడా ఇబ్బందిగా ఫీలవుతారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అలాంటి రూట్లలో తిరిగే బస్సుల్లో మహిళా కండక్టర్లనే నియమించాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.సింహాచలం, కనకమహాలక్ష్మి ఆలయం, కలెక్టరేట్, కేజీహెచ్, ద్వారకా బస్ కాంప్లెక్స్, పూర్ణామార్కెట్, వీఎస్‌ఈజెడ్, విశాఖ రైల్వేస్టేషన్, దువ్వాడ రైల్వే స్టేషన్ వంటి ప్రాంతాలకు ఎక్కువమంది మహిళలు వివిధ అవసరాల మీద బస్సుల్లో రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ రీజియన్‌లో 388 మహిళా కండక్టర్లు ఉండగా, వారిలో కనీసం 200 మందినైనా ఈ రూట్లలో షెడ్యూలింగ్ చేయాలని ఆలోచిస్తున్నారు.

# సీతాఫలం ధర పతనం

**కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న రైతులు**

**గత వారం క్రేట్ పండ్ల ధర రూ.700**

**ఈ వారం రూ.300 నుంచి రూ.400 లోపు**

**డీలా పడిన రైతులు**

**వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో ఈ దుస్థితి**



అనంతగిరిజూలై 31 (సందేశం టైమ్స్): సీతాఫలాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ ?గిరిజన ప్రాంతంలో ధర పతనం కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని డముకు వారపు సంతలో గత వారం క్రేట్ పండ్లు (సైజును బట్టి 70 నుంచి 100) రూ.700 ధర పలికింది. ఈ వారం క్రేట్ ధర రూ.300 నుంచి రూ.400 లోపు పలకడంతో రైతులు డీలా పడ్డారు.సీతాఫలం సీజన్ ప్రారంభమై నాలుగో వారం కావస్తుండగా, మూడు వారాలు ధర బాగానే ఉన్నప్పటికీ ఈ వారం ఒక్కసారిగా ధర పడిపోయింది. సరైన ధర పలకకపోవడంతో ఈ బుధవారం డముకు వారపు సంతకు వచ్చిన గిరిజన రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. డముకు వారపు సంతకు నిమ్మలపాడు, వాలసీ, జెండగరువు, గొర్రెగుమ్మి, బొడ్డపాడు, పెదబిడ్డ, గుమ్మ, చెరుకుబిడ్డ నుంచి పెద్ద ఎత్తున రైతులు సీతాఫలాలు తీసుకువచ్చారు. అయితే విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, జామి, గంట్యాడ, మైదాన ప్రాంతాల వ్యాపారులు సిండికేట్‌గా మారి ?ధరను వారికి అనుకూలంగా మార్చుకున్నారని రైతులు ఆవేదన చెందున్నారు. గ్రామాల్లోని తమ ఇంటి వద్దకే వచ్చి గత వారం క్రేట్ సీతాఫలాలు రూ.700 ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారని, ఈ వారం సంతకు వస్తే రూ.300 నుంచి రూ.400లకు మాత్రమే అడిగారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# సీఎం సహాయ నిధి పంపిణీ



రాజంపేట,జూలై 31 (సందేశం టైమ్స్): సీఎం సహాయ నిధి ద్వారా దగ్గుపాటి పురందేశ్వరి సహకారంతో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ రాజంపేట మండలం మందరం గ్రామానికి చెందిన చాపల ఈశ్వరమ్మకు రూ.60వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందజేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. నరసింహరాజు, కృష్ణయాదవ్, సునీతానారాయణవర్మ, ప్రసాద్‌రెడ్డి, రమణయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులకు లైన్ క్లియర్..



హైదరాబాద్ సిటీ:జూలై 31 (సందేశం టైమ్స్): హైదరాబాద్ మహా నగరానికి, ఫ్యూచర్ సిటీకి లింకు చేసే ప్రధాన రహదారి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. ప్రభుత్వ భూముల్లోనే రోడ్డు పనులు చేపట్టేందుకు హైకోర్టు అనుమతులిచ్చింది. దాంతో టెండర్ ప్రక్రియను పూర్తి చేసే చర్యలను హెచ్‌ఎండీఏలోని హైదరాబాద్ గ్రోథ్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) చేపట్టింది. రెండు ప్యాకేజీల్లో తాజాగా ప్రైస్ బిడ్ కూడా చేశారు. ఒక్కో ప్యాకేజీకి ఒక్కో సంస్థ చొప్పున రెండు నిర్మాణ సంస్థలు ఎంపికయ్యాయి.అన్ని సంస్థలూ అదనంగా కోట్ చేయడంతో ఉన్నంతలో ప్యాకేజీ-1కు నిర్ణయించిన విలువ కంటే 3.93 శాతం అదనంగా కోట్ చేసిన మెస్సర్స్ రిత్విక్ ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్‌ను, ప్యాకేజీ-2కు నిర్ణయించిన విలువ కంటే 4.20శాతం అదనంగా కోట్ చేసిన ఎల్అండ్‌టీ సంస్థను ఎంపిక చేసినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు ప్రకటించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌తరహాలోనే నాలుగో నగరంగా రాబోతున్న ఫ్యూచర్ సిటీకి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రధాన రోడ్డుగా గ్రీన్ ఫీల్డ్ రోడ్డును నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# 40 ఏళ్ల వ్యక్తితో 13 ఏళ్ల బాలికకు వివాహం




నందిగామజూలై 31 (సందేశం టైమ్స్): మైనర్ బాలిక (13)కు 40 ఏళ్ల వ్యక్తితో పెళ్లి చేశారు. అనంతరం ఆ బాలిక తాను చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కలిసి న్యాయం చేయాలని ప్రాధేయపడింది. రంగారెడ్డి జిల్లా నందిగామకు చెందిన ఓ మహిళకు ఒక కూతురు,కుమారుడు ఉన్నారు. భర్త చనిపోవడంతో కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. ఆమె కూతురు ప్రభు త్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కుటుంబ పోషణ భారమవడంతో కూతురికి పెళ్లి చేసేందుకు మధ్యవర్తిని సంప్రదించగా.. అతను రంగారెడ్డి జిల్లా చేవెళ్లమండలం కందవాడకు చెందిన 40ఏళ్లకి ఆస్తి బాగా ఉందంటూ సంబంధం తెచ్చాడు. దీంతో మే 28న వివాహం జరిపించారు. ఈ క్రమంలో ఇష్టం లేని పెళ్లి చేశారని, చదువుకుంటానంటూ మంగళవారం బాలిక.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి తెలిపింది. ఆయన నందిగామ తహసీల్దార్ వద్దకు బాలికను తీసుకెళ్లగా ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. బాలిక ఫిర్యాదు మేరకు ఆమె తల్లితో పాటు పెళ్లికొడుకు, మధ్యవర్తి, వివాహం జరిపిన పూజారిపై బాల్య వివాహ నియంత్రణ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం బాలికను రెస్క్యూ హోంకు తరలించారు.

# నిరుపయోగంగా అద్దె గదులు!



యాదగిరిగుట్ట,జూలై 31 (సందేశం టైమ్స్): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్ర దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. వీరికోసం పాతఆచారాల పునరుద్ధరణ పేరుతో సదుపాయాలు కూడా ఒక్కొక్కటిగా కొండపైన సమకూరుతున్నాయి. కొండకింద పాతబస్టాండ్ ఎదురుగా భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన అద్దె గదుల విషయంలో మాత్రం దేవస్థానం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. టెండరుదారుడు వేలం పాట అధికంగా నిర్వహించడంతో అద్దె చెల్లించలేక చేతులెత్తేశారు. దేవస్థానం అద్దె గదుల నిర్వహణ పట్టించుకోక నిరుపయోగంగా మారి భక్తులకు గదుల కొరత ఎదురవుతోంది. కొండకింద కుల సత్ర భవనాల అద్దె గదుల వ్యాపారానికి దేవస్థానం అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.బస్టాండ్ ఎదురుగా హైదరాబాద్ ప్రధానరహదారిపై నిర్మించిన ఆండాళ్ నిలయం భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గోడలకు మర్రి, రావి చెట్లు మొలుస్తున్నాయి. 24 అద్దె గదులు, కింది భాగంలో 56 దుకాణ సముదాయాలు, 4 హాళ్లు ఉన్నాయి. భక్తులు అందుబాటులో ఉండేలా మూడేళ్ల (2023 మార్చి 20 నుంచి 2026 మార్చి 19 వరకు) కాలపరిమితితో టెండరు నిర్వహించారు. కాలక్రమేణా అద్దె అధికమై నష్టాలు వస్తున్నాయంటూ టెండరుదారుడు ఈ ఏడాది మార్చి నెలలో ఏడాది ముందుగానే టెండరుదారుడు దేవస్థానానికి అప్పగించాడు. నాటి నుంచి నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనార్థం తరలివచ్చే భక్తులకు గదుల వసతి లేకుండాపోయింది.

# పెంటఖుర్దులో కొత్త కల్యాణీ చాళుక్యుల శాసనం



హైదరాబాద్‌జూలై 31 (సందేశం టైమ్స్): నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెంటఖుర్దులో కొత్త కల్యాణి చాళుక్యుల శాసనం వెలుగు చూసిందని కొత్త తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్, చరిత్రకారులు శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. గ్రామానికి చెందిన శివాలాయ భక్తుల కృషివల్ల ఈ శాసనం గురించి తెలియవచ్చిందని చెప్పారు. 'పెంటఖుర్దులో శిథిల శివాలయముండేది. 1984లో నాటి గ్రామ సర్పంచు పరుచూరు రాంచందర్ రావు, యలవర్తి జయరామారావు, కొడాలి సూర్యుడమ్మ ఈ దేవాలయాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా పురాత ఆలయ శిథిలాలలో లభించిన శాసనస్తంభాన్ని భద్రపరిచారు. ఈ శాసనంలోని విషయాన్ని తెలుసుకోవడానికి గ్రామానికి నివాసులు బీవీ భాస్కర్ రెడ్డి, గడ్డం వీరరాజారావు, మద్దినేని శ్రీనివాసరావు, ముక్కల శ్రీనివాసరెడ్డి, కొత్తపల్లి నాగేశ్వరరావు, చిట్టెం శివసాయిపటేల్, గైని గంగారాం, జంగం సంజప్ప, నాగల్ల కోటేశ్వరరావు, బీ.నాగిరెడ్డి, డీ.హరీశ్ చేసిన కృషివల్ల కొత్తశాసనం వెలుగులోకి వచ్చింది.

# ఇక.. పూడికతీత పనుల్లో హైడ్రా..



జూలై 31 (సందేశం టైమ్స్): నగరంలోని నాలాలు, క్యాచ్‌పిట్లు, కల్వర్టుల్లోని చెత్తను హైడ్రా బృందాలు తొలగిస్తున్నాయి. హైడ్రా డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు), ఎంఈటీ (మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్) బృందాలు నిరంతరాయంగా నాలాల్లో చెత్తను తొలగిస్తున్నాయి.

నగరంలోని నాలాలు, క్యాచ్‌పిట్లు, కల్వర్టుల్లోని చెత్తను హైడ్రా బృందాలు తొలగిస్తున్నాయి. హైడ్రా డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు), ఎంఈటీ (మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్) బృందాలు నిరంతరాయంగా నాలాల్లో చెత్తను తొలగిస్తున్నాయి. కల్వర్టులు, క్యాచ్‌పిట్లు, వరద కాలువల వద్ద లారీల కొద్దీ పూడిక బయట పడుతోంది. అల్వాల్‌లోని బృందావన్ కాలనీ కల్వర్టులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, సిల్ట్‌ను తొలగించడంతో వరద నీరు సాఫీగా వెళ్తోంది. %బుల్కాపూర్ నాలాలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సిల్ట్‌తో పాటు, చెత్త తొలగించే పనులు కొనసాగుతున్నాయి. టోలిచౌకీ ప్రాంతంలోని హకీంపేట, హఫీజ్‌బాబానగర్, సాబాజ్‌కాలనీ అయేషా మసీద్ రోడ్డు తదితర ప్రాంతాల్లో టన్నుల కొద్దీ చెత్త బయట పడుతోంది. బోరబండ పెద్దమ్మనగర్‌లో వర్షం పడితే నీరు రహదారులను ముంచెత్తేది. సిల్ట్ తొలగించడంతో నీరు సాఫీగా పోతోంది. కూడికుంట లేక్ ఔట్ లెట్‌లో పేరుకుపోయిన చెత్తను కూడా హైడ్రా బృందాలు తొలగించాయి.

# బాలికపై ఐదుగురు బాలుర అత్యాచారం




జడ్చర్ల, జూలై 31 (సందేశం టైమ్స్): హబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో తొమ్మిదేళ్ల బాలికపై ఐదుగురు బాలురు అత్యాచారానికి పాల్పడ్డారు. మూడు రోజుల క్రితం ఈ దారుణ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసు వర్గాల ద్వారా తెలిసిన సమాచారం మేరకు... జడ్చర్ల మునిసిపాలిటీలోని ఓ కాలనీలో ఆ బాలిక కుటుంబం నివసిస్తోంది. ఆమెకు సోదరి, సోదరుడు ఉన్నారు. ఆ రోజు తండ్రి ఉదయమే బయటికి వెళ్లాడు. తల్లి అస్వస్థతకు గురైన పెద్ద కుమార్తెను ఆస్పత్రికి తీసుకెళ్లింది.అదే సమయంలో నలుగురు బాలురు ఇంటికి వచ్చారు. బాలికపై ఆ నలుగురితో పాటు ఆమె సమీప బంధువు కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన తల్లి ముభావంగా ఉన్న చిన్న కుమార్తెను ప్రశ్నించడంతో జరిగిన దారుణాన్ని తెలిపింది. వెంటనే చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అనంతరం బాలికను సఖి కేంద్రానికి తరలించారు. అత్యాచారానికి పాల్పడిన ఐదుగురు బాలురలో 4వ, 5వ తరగతి చదువుతున్న 12 సంవత్సరాల వయస్సున్న వారు నలుగురు కాగా ఇంటర్ చదువుతున్న 16 ఏళ్ల మరో బాలుడు ఉన్నా డు. వారిపై గ్యాంగ్‌రేప్, పోక్సో కేసు నమోదు చేశారు.

# శ్మశానవాటికనూ వదల్లేదు..

## భువనగిరిలో దశాబ్దాలనాటి ఘోరీలు నేలమట్టం

### రెండెకరాల 'రియల్' భూముల కోసం దారుణం

### కాంగ్రెస్ నేతల అండదండలతో ఆగడాలు?



జూలై 31 (సందేశం టైమ్స్): కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు.. భూములు కొల్లగొట్టేందుకు కాదేదీ అడ్డు అన్న చందంగా ఉంది భువనగిరి పట్టణంలో పరిస్థితి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఏకంగా శ్మశాన వాటికనే నేలమట్టం చేశారు. ధనార్జనే ధ్యేయంగా తాతల కాలం నాటి సమాధులను నేలకూల్చారు. అధికార కాంగ్రెస్ నేతల అండదండలతో ఆగడాలకు పాల్పడ్డారు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే పోలీసులతో భయభ్రాంతులు, కేసులు పెట్టి వేధిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. %యాదాద్రి సమాధుల నేలమట్టంపై ఉద్యమించేందుకు అన్ని పార్టీల నేతలతో కలిపి బుధవారం బహుజన శ్మశాన వాటిక పరిరక్షణ సమితిని ఏర్పాటు చేశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి ఎదురుగా ఉన్న తాతానగర్‌కు వెళ్లే దారిలో శ్మశాన వాటికలున్నాయి. దశాబ్దాలుగా వివిధ కులాలకు చెందిన శవాలను ఇక్కడే పూడ్చిపెట్టేవారు. ముఖ్యంగా గంగపుత్రులు, ముదిరాజ్‌ల సమాధులు అధికంగా ఉన్నాయి. సర్వే నంబర్ 1064లో సుమారు రెండు ఎకరాల్లో వందలాది సమాధులు ఉండేవి. ఇటీవల కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ పేరుతో కొందరు రంగంలోకి దిగారు. పూర్తిగా గోరీలతో నిండిపోయిన స్థలం తమదంటూ స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల సహకారంతో జేసీబీలు తెప్పించి ఉన్నపళంగా సుమారు వందకుపైగా గోరీలను కూల్చివేశారు. అక్కడే మున్సిపల్ నిధులతో నిర్మించిన వాటర్‌ట్యాంక్, నల్లాలు, స్నాన ఘట్టాలను కూడా కూలగొట్టారు.

# సుపారీ ఇచ్చి మరీ భర్త హత్యకు కుట్ర

నాగిరెడ్డిపేటజూలై 31 (సందేశం టైమ్స్): పియుడి మోజులో పడిన ఇల్లాలు కట్టుకున్న భర్తనే కడతేర్చేందుకు కుట్ర పన్నింది. సుపారీ ఇచ్చి మరీ అంతమొందించాలని చూసింది. ప్రియుడితో కలిసి చేసిన హత్యాయత్నం విఫలం కావడంతో ఆమె ప్లేట్ ఫిరాయించింది. పోలీసులను తప్పుదోవ పట్టించాలని కూడా చూసింది. కానీ అన్ని ప్రయత్నాలు ఎదురుతన్నడంతో ఆ ఇల్లాలి కుట్ర బయటపడింది. కేసు వివరాలను సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై అగస్త్య భాస్కర్‌గౌడ్‌తో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ విలేకరులకు వెల్లడించారు. %నాగిరెడ్డిపేట మండలం చిన్న ఆత్మకూర్‌కు చెందిన పల్లె రవి భార్య సంపూర్ణకు, అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జాన్సన్‌కు మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నది. తమ మధ్య అడ్డుగా ఉన్న రవిని అంతమొందించాలని సంపూర్ణ నిర్ణయించుకుంది. తన భర్తను చంపేస్తే రూ.లక్ష సుపారీ ఇస్తానని, ఇందుకోసం ఎవరైనా ఉంటే చూడాలని ఆమె ప్రియుడితో చెప్పి, భర్త ఫొటోను అప్పగించింది. అయితే, రవి తనకు డబ్బులకు ఇబ్బందిగా ఉన్నదని, అప్పుగా ఇప్పించాలని జాన్సన్‌ను కలిశాడు.తన వద్ద లేవని, కానీ, తాండూర్‌లో తనకు తెలిసిన వారు అప్పు ఇస్తారని చెప్పి ఈ నెల 23న రవిని, గ్రామానికి చెందిన నవీన్‌ను వెంటబెట్టుకుని వెళ్లాడు. అక్కడ చాకలి రాజు, మరో బాలుడిని కలిసి అప్పు విషయమై మాట్లాడారు. ఈ క్రమంలో వారంతా కలిసి ఎల్లారెడ్డి మండలం పెద్దారెడ్డి డంప్ యార్డుకు వచ్చి అర్ధరాత్రి దాకా మద్యం సేవించారు.




# క్రీడావార్తలు




## భారత చివరి టెస్ట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం.. మనకు లాభమా, నష్టమా..




ఆండర్సన్–టెండుల్కర్ ట్రోఫీ 2025లో ఐదవ, చివరి టెస్ట్ మ్యాచ్ కోసం వేదిక సిద్ధమైంది. జూలై 31న మధ్యాహ్నం 3.30 గంటల నుంచి లండన్‌లోని ది ఓవల్‌లో ఇంగ్లండ్, భారత జట్లు తలపడనున్నాయి. ఇప్పటివరకు ఈ రెండు జట్లు నాలుగు టెస్ట్ మ్యాచ్‌లలో పోటీపడ్డాయి. ఇంగ్లండ్ మొదటి, మూడో టెస్ట్‌లలో విజయం సాధించగా, భారత్ రెండవ టెస్ట్‌లో గెలిచింది, నాల్గవ టెస్ట్ డ్రాగా ముగిసింది.%ఈ నేపథ్యంలో సిరీస్‌లో ఇంగ్లండ్ ఆధిపత్యంలో ఉండగా, చివరి టెస్ట్‌లో భారత్‌పై ఒత్తిడి ఉంది. ఈ మ్యాచ్‌లో ఇండియా ఓటమి ఇంగ్లాండ్‌కు సిరీస్ విజయాన్ని అందిస్తుంది. అందుకే భారత జట్టు పూర్తి శక్తితో ఆడి, 2–2 స్కోర్‌తో సిరీస్‌ను సమం చేయాలని లక్ష్యంతో ఉంది.కానీ మ్యాచ్ మొదటి రోజు వాతావరణం అభిమానులకు నిరాశ కలిగించేలా ఉంది. లండన్‌లో వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఎక్కువగా ఉందని అక్యూ వెదర్ సూచిస్తోంది. ఉదయం సమయంలో వర్షం ఎక్కువగా కురిసే అవకాశం ఉండగా, మధ్యాహ్నం సమయంలో కొద్దిపాటి మేఘావృతం ఉంటుందని తెలుస్తోంది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో వర్షం కురిసే అవకాశం 50 శాతం ఉండగా, 85 శాతం మేఘావృతమై ఉంటుందని అంచనా. ఈ పరిస్థితుల్లో మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.వర్షం ఆటంకం కలిగిస్తే, దాని ప్రభావం భారత జట్టుపై ఎలా ఉంటుంది. వర్షం వల్ల మ్యాచ్ డ్రాగా ముగిస్తే, ఇంగ్లాండ్ సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. ఇది భారత్‌కు నష్టం కలిగించే అంశమని చెప్పవచ్చు.

మరోవైపు, వర్షం వల్ల ఆట సమయం తగ్గితే, భారత బ్యాట్స్‌మెన్‌లపై ఒత్తిడి పెరుగుతుంది. వారు తక్కువ సమయంలో మంచి స్కోర్ సాధించేందుకు ప్రయత్నించవచ్చు. కానీ భారత బౌలర్లు మేఘావృత వాతావరణంలో స్వింగ్ బంతులతో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టవచ్చు. ఇది భారత్‌కు కొంత లాభం చేకూర్చవచ్చు.భారత జట్టు ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే మాత్రం వారి బ్యాటింగ్, బౌలింగ్ రెండూ కీలకం కానున్నాయి. ఇంగ్లాండ్ బలమైన బౌలింగ్ లైనప్‌ను ఎదుర్కోవాలి. వర్షం వల్ల ఆటకు అంతరాయం కలిగితే, సమయం పరిమితంగా ఉండటం వల్ల వ్యూహాత్మకంగా ఆడటం మరింత కష్టమవుతుంది. అభిమానులు ఈ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ టెస్ట్ ఫలితం సిరీస్ విజేతను నిర్ణయిస్తుంది. కాబట్టి రెండు జట్లూ కూడా విజయం సాధించాలనే ధీమాతో ఉన్నాయి.

## గంభీర్‌కు ఆ హక్కుంది గిల్



ఓవల్ చీఫ్ క్యూరేటర్ ఫోర్టిసతో ఘర్షణ విషయంలో కోచ్ గంభీర్‌కు గిల్ మద్దతుగా నిలిచాడు. పిచ్‌ను పరిశీలించడానికి భారత కోచ్‌కు హక్కుందన్నాడు. ఇదో అనవసర వివాదమని అభిప్రాయపడ్డాడు. భారత సహాయ సిబ్బంది వికెట్‌ను పరిశీలించడానికి వెళ్లినప్పుడు.. దూరం నుంచే చూడాలని ఫోర్టిస్ చెప్పడంతో అతడిపై గౌతీ ఫైర్ అయ్యాడు. 'ఇలా దూరం నుంచే చూడాలని చెప్పడం ఇంతకుముందు ఎన్నడూ జరగలేదు. వికెట్‌ను పరిశీలించడం కెప్టెన్, కోచ్ బాధ్యత' అని గిల్ చెప్పాడు. ఇతర వేదికలపై ఎటువంటి ఆంక్షలు విధించలేదని తెలిపాడు. కాగా, ఇంగ్లండ్ తాత్కాలిక కెప్టెన్ ఒలీ పోప్, రూట్ బుధవారం పిచ్‌పై నిలుచొని షాడో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడం కనిపించింది. దీంతో టీమిండియా పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని ఫ్యాన్స్ విమర్శిస్తున్నారు. మాజీ ఆటగాళ్లు పార్థివ్ పటేల్, ఇర్ఫాన్ పఠాన్ కూడా గంభీర్‌ను సమర్థించారు.

## కంగారూల దేశానికి కుర్ర దళం.. భారత్ 19 జట్టు రెడీ



భారత క్రికెట్ నియంత్రణ మండలి (%దీజజ×%) తాజాగా ఆస్ట్రేలియా టూర్ కోసం అండర్–19 జట్టును ప్రకటించింది. ఈ టూర్‌లో భారత యువ జట్టు, ఆస్ట్రేలియా అండర్–19 జట్టుతో మూడు వన్డే మ్యాచ్‌లు, రెండు మల్టీ–డే మ్యాచ్‌లు ఆడనుంది. సెప్టెంబర్ 2025లో జరిగే ఈ సిరీస్ యువ క్రికెటర్లకు తమ సత్తా చాటేందుకు మంచి అవకాశమని చెప్పవచ్చు. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఈ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో అతడు చూపించిన ప్రతిభ ఈ ఎంపికకు కారణమైంది. ఇంగ్లండ్‌లో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో 3–2 తేడాతో భారత్ విజయం సాధించగా, రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ డ్రాగా ముగిసింది. వైభవ్ లాంటి యువ క్రీడాకారులు ఈ టూర్‌లోనూ తమ ఆటతీరుతో ఆకట్టుకోవాలని ఆశిస్తున్నారు. ఈ టూర్‌కు ఆయుష్ మాత్రే జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లండ్ టూర్‌లో కూడా అతడు నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించాడు. తన సారథ్యంలో భారత యువ జట్టు ఆకట్టుకునే ప్రదర్శన కనబరిచింది. దీంతో ఆయుష్ నాయకత్వంలో ఆస్ట్రేలియా గడ్డపై భారత యువ క్రికెటర్లు తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 21 నుంచి ఈ టూర్ మొదలు కానుంది. మూడు వన్డే మ్యాచ్‌లు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 3 వరకు జరగనున్నాయి. అలాగే, మొదటి మల్టీ–డే మ్యాచ్ కూడా ఈ తేదీల్లోనే ఉంటుంది. రెండో మల్టీ–డే మ్యాచ్ అక్టోబర్ 7 నుంచి మొదలవుతుంది. ఈ మ్యాచ్‌లన్నీ నార్త్‌లో జరగనుండగా, రెండో మల్టీ–డే మ్యాచ్ మాకేలో ఆడనున్నారు. ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, వేదాంత్ త్రివేది, రాహుల్ కుమార్, అభిగ్యాన్ కుండు (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), ఆర్.ఎస్. అంబ్రిష్, కనిష్క్ చౌహాన్, నామన్ పుష్పక్, హేనిల్ పటేల్, డి. దీపేష్, కిషన్ కుమార్, అన్మోల్‌జీత్ సింగ్, ఖిలన్ పటేల్, ఉధవ్ మోహన్, అమన్ చౌహాన్ కలరు. ఇంగ్లండ్ టూర్‌లో సాధించిన విజయాలతో ఉత్సాహంగా ఉన్న భారత అండర్–19 జట్టు, ఆస్ట్రేలియా గడ్డపై కూడా అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. ఆస్ట్రేలియా జట్టు ఇండియాకు గట్టి పోటీ ఇవ్వనుంది. ఈ టూర్‌లో భారత యువ క్రికెటర్లు తమ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరచాలని అభిమానులు ఆశిస్తున్నారు.

## మర్చండ్ ప్రపంచ రికార్డు



సింగపూర్: ఒలింపిక్ చాంపియన్, ఫ్రెంచ్ స్విమ్మర్ లియోన్ మర్చండ్ ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిపలోనూ తనకు తిరుగులేదని చాటాడు. 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో మర్చండ్ ఒక నిమిషం 52.61 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో 2011లో అమెరికా స్విమ్మర్ ర్యాన్ లోచెట్ నమోదుచేసిన ఒక నిమిషం 54 సెకన్ల ప్రపంచ రికార్డును మర్చండ్ బద్దలుకొట్టాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణ పతకాలు కొల్లగొట్టిన 23 ఏళ్ల మర్చండ్.. ఇంకా 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేతో పాటు రిలే ఈవెంట్‌లో పోటీపడాల్సి ఉంది.

## పాకిస్థాన్‌తో సెమీస్ ఆడం



బర్మింగ్‌హామ్: పాకిస్థాన్‌తో గురువారం జరగాల్సిన టీ20 లెజెండ్స్ వరల్డ్ చాంపియన్‌షిప సెమీఫైనల్ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు భారత జట్టు ప్రకటించింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీసలు ఆడకూడదన్న నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పాక్‌తో మ్యాచ్ నుంచి వైదొలగుతున్నట్టు భారత లెజెండ్స్ తెలిపారు. ఈ టోర్నీ లీగ్ దశలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌నూ భారత్ బహిష్కరించింది. శిఖర్ ధవన్, యువరాజ్ సింగ్ (కెప్టెన్), ఇర్ఫాన్ పఠాన్, హర్భజన్ సింగ్, సురేష్ రైనా వంటి మాజీ స్టార్లు భారత జట్టులో ఉన్నారు. భారత జట్టు వైదొలగాలన్న నిర్ణయంతో పాక్ ఆడకుండానే టోర్నీ ఫైనల్‌కు చేరుకుంది. ఇక ఆస్ట్రేలియా–దక్షిణాఫ్రికా జట్ల మధ్య గురువారం జరిగే సెమీఫైనల్ విజేతతో పాక్ ఫైనల్లో తలపడుతుంది. భారత్ సహా మొత్తం ఆరు జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి.

## జోష్‌లో యువ భారత్




లండన్: మాంచెస్టర్ టెస్ట్‌లో అద్భుత పోరాటాన్ని ప్రదర్శించిన భారత జట్టు.. ఇంగ్లండ్ పర్యటనను విజయంతో ముగించాలనుకొంటోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీసలో 1–2తో వెనుకంజలో ఉన్న శుభ్‌మన్ గిల్ సేన.. గురువారం నుంచి ఓవల్‌లో జరిగే ఐదో, ఆఖరి మ్యాచ్‌లో గెలిచి సిరీసను సమం చేయాలనే పట్టుదలతో ఉంది. లార్డ్స్‌లో క్రాలేతో గిల్ వాగ్వాదం.. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో స్టోక్స్ డ్రా ప్రతిపాదనకు జడేజా నో చెప్పడం.. తాజాగా క్యూరేటర్ లీ ఫోర్టిసపై గంభీర్ ఆగ్రహం లాంటి ఘటనలతో సిరీస్ హాట్‌హాట్‌గా మారింది. రోహిత్, కోహ్లీ, అశ్విన్ లాంటి స్టార్లు లేకుండా.. యువ ఆటగాడు గిల్ సారథ్యంలో ఇంగ్లండ్ వెళ్లిన భారత్ కొన్నిసార్లు తడబడినా.. ఓవరాల్‌గా ఢీ అంటే ఢీ అన్నట్టుగానే ఎదురు నిలిచింది. పైగా, స్టోక్స్ గైర్హాజరీలో డీలాపడ్డ ఇంగ్లండ్‌కు నాకౌట్ పంచ్ ఇచ్చేందుకు గిల్ సేనకు ఇదో సువర్ణావకాశం.నాలుగో టెస్ట్‌లో చాలా భాగం ఆతిథ్య జట్టుదే ఆధిపత్యమే అయినా.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల అసాధారణ పోరాటంతో భారత్ డ్రాతో గట్టెక్కింది. ముఖ్యంగా కీలక బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉండడం టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. ఓపెనర్ రాహుల్ నిలకడగా రాణిస్తుండగా.. గిల్ మళ్లీ టచ్‌లోకి రావడం శుభపరిణామం. అయితే, మరో ఓపెనర్ జైస్వాల్ వరుస వైఫల్యాలు జట్టును దెబ్బ తీస్తున్నాయి. సాయి సుదర్శన్ క్రీజులో నిలిచేందుకు ప్రయత్నించాలి. గత మ్యాచ్‌లో చిరస్మరణీయశతకాలు సాధించిన జడేజా, సుందర్ నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను కోరుకొంటోంది. గాయంతో రిషభ్ పంత్ చివరి మ్యాచ్‌కు దూరమవడంతో.. ధ్రువ్ జురెల్ కీపర్‌గా తుది జట్టులోకి రానున్నాడు. పంత్ లేకపోవడంతో బ్యాటింగ్ డెప్త్ కోసం శార్దూల్ ఠాకూర్‌ను కొనసాగించడానికే మేనేజ్‌మెంట్ మొగ్గుచూపుతున్నట్టు సమాచారం.

## ఇంకా సందిగ్ధమే



కీలక మ్యాచ్‌కు పేస్ గన్ బుమ్రా అందుబాటులో ఉంటాడా? లేదా? అనే దానిపై సందిగ్ధం కొనసాగుతోంది. పని భారం నేపథ్యంలో బుమ్రాకు విశ్రాంతి నివ్వాలని నిర్ణయించినట్టు ఊహాగానాలు బలంగా వినిపించాయి. వెన్నునొప్పితో ఇబ్బందిపడుతున్న బుమ్రా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అతడిని దూరంగా ఉంచాలని మెడికల్ టీమ్ సూచించినట్టు సమాచారం. కానీ, మ్యాచ్ రోజు ఉదయం పిచ్‌ను పరిశీలించిన తర్వాత బుమ్రాపై తుది నిర్ణయం తీసుకొంటామని గిల్ తెలిపాడు.

# బిజినెస్



## ఆరు భారత కంపెనీలపై అమెరికా ఆంక్షలు.. అసలు కారణమిదే..




అమెరికా ఇటీవల తీసుకున్న ఓ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. అమెరికా ప్రభుత్వం మొత్తం 6 భారతీయ కంపెనీలపై ఆంక్షలు విధించింది. ఎందుకంటే ఈ కంపెనీలు ఇరాన్ నుంచి చమురు, పెట్రో రసాయన ఉత్పత్తులు కొనుగోలు చేశాయన్న ఆరోపణలతో నిర్ణయం తీసుకున్నారు.అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకారం ఇరాన్ ప్రభుత్వం ఆర్థిక ఆదాయాన్ని మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెంచడానికి, ఉగ్రవాదాన్ని నడిపేందుకు, ప్రజలపై ఒత్తిడి తెచ్చేందుకు వినియోగిస్తోంది. అందుకే అలాంటి ఆదాయ మార్గాలను మేము కట్ చేస్తున్నామని అమెరికా తెలిపింది.

ఏ కంపెనీలపై చర్యలు తీసుకున్నారు?

ఇరాన్ నుంచి పెద్ద ఎత్తున చమురు, మిథనాల్, టోల్యూన్, పాలిథీన్ వంటివి దిగుమతి చేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో మొత్తం 6 భారత కంపెనీల పేర్లను అమెరికా వెల్లడించింది. వాటిలోఆల్కెమికల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్: 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు 84 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ పెట్రోకెమికల్ ఉత్పత్తులను దిగుమతి చేసినట్లు ఆరోపణ.గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్ లిమిటెడ్: 2024 జూలై నుంచి 2025 జనవరి వరకు 51 మిలియన్ డాలర్ల విలువైన మిథనాల్‌తో సహా ఇరాన్ ఉత్పత్తులను కొనుగోలు చేసిందని ఆరోపణ.జూపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్: టోలుయెన్‌తో సహా 49 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ ఉత్పత్తులను దిగుమతి చేసినట్లు ఆరోపణ.రమణీక్‌లాల్ ఎస్ గోసాలియా అండ్ కంపెనీ: 22 మిలియన్ డాలర్ల విలువైన మిథనాల్, టోలుయెన్‌లను కొనుగోలు చేసినట్లు ఆరోపణ.పెర్సిస్టెంట్ పెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్: 2024 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 14 మిలియన్ డాలర్ల విలువైన మిథనాల్ దిగుమతి చేసినట్లు ఆరోపణ.కాంచన్ పాలిమర్స్: 1.3 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ పాలిథీన్ ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు ఆరోపణ.

## మళ్లీ భారీ నష్టాల్లో మార్కెట్లు.. 15 నిమిషాల్లో రూ. 5 లక్షల కోట్లు లాస్




దేశీయ స్టాక్ మార్కెట్లలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎఫెక్ట్ కారణంగా సూచీలు మొత్తం దిగువక పయనిస్తున్నాయి. ట్రంప్ భారతీయ దిగుమతులపై 25% సుంకం విధించనున్నారన్న వార్తలతో ఇప్పటికే సెన్సెక్స్, నిఫ్టీలు బలహీనత చూపిస్తున్న మార్కెట్లు మరింతగా ఒడిదొడుకులకు లోనయ్యాయి.నిఫ్టీ నెలవారీ ఎక్స్‌పైరీ రోజు కావడంతో మార్కెట్‌లో ఒత్తిడి ఉన్నప్పటికీ, ట్రంప్ నిర్ణయం నెగటివ్ మూడ్‌ను మరింత పెంచేశాయి. ఈ క్రమంలో బీఎస్ఈ సెన్సెక్స్ ఈ రోజు ట్రేడింగ్‌ను 786 పాయింట్ల నష్టంతో 80,695 వద్ద ప్రారంభించగా, నిఫ్టీ 235 పాయింట్లు కోల్పోయి 25,241 వద్ద ఓపెన్ అయింది. బ్యాంక్ నిఫ్టీ కూడా భారీ నష్టాల్లో 422 పాయింట్లు పడిపోయి 55,728 వద్ద ప్రారంభమైంది. దీంతో ఇన్వెస్టర్లు మొదటి 15 నిమిషాల్లోనే రూ. 5 లక్షల కోట్లు నష్టపోయారు.ఆటో, రియాల్టీ రంగాల సూచీలు అత్యంత దారుణంగా క్షీణించాయి. మీడియా, బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు కూడా భారీ నష్టాలను చవిచూశాయి. అన్ని రంగాల సూచీలు రెడ్ మార్క్‌లో ట్రేడవుతున్నాయి. ఇది మార్కెట్‌లో ఒత్తిడిని సూచిస్తుంది. సెన్సెక్స్ 30 స్టాక్‌లలో కేవలం ఐదు మాత్రమే గ్రీన్ మార్క్‌లో ఉన్నాయి. ఎటర్నల్, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, స్టాక్‌లు అప్‌ట్రెండ్‌లో ఉండగా, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్, టైటాన్, స్టాక్‌లు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి.ఈ ప్రభావంతో రూపాయి మారకం విలువ కూడా డాలరుతో పోల్చితే 27 పైసలు క్షీణించి 87.69 వద్ద ట్రేడవుతోంది. ఇది గత ఐదు నెలల్లో అతి తక్కువ స్థాయి కావడం విశేషం. దిగుమతుల ఖర్చు పెరగడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు రూపాయిపై ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి.

## కొత్త ఫీచర్.. ఇకపై కంటిచూపుతోనే పేమెంట్స్..!




: ప్రపంచ దేశాలతో పోలిస్తే డిజిటల్ చెల్లింపులు చేసే భారతీయుల సంఖ్య ఎక్కువ. యూపీఐ పేమెంట్స్ దేశ ఆర్థికవ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. త్వరలో మరో కొత్త ఫీచర్ ప్రవేశపెట్టబోతోంది యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ). ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే చెల్లింపుల కోసం పిన్ నమోదు చేయవలసిన అవసరం ఉండదు. యూజర్లు వారి ఫేస్ లేదా వేలిముద్రలు, ఐరిస్ (కనుపాప)ను ఉపయోగించి చెల్లింపులు చేయగలరు. ఈ ఫీచర్ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. మరికొన్ని నెలల్లో దీన్ని ప్రారంభించాలని భావిస్తోంది.నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లావాదేవీల్లో పిన్‌కు బదులుగా బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. అంటే %రు=% కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాత మీరు మీ వేలిముద్ర లేదా ముఖ గుర్తింపును ఉపయోగించి చెల్లింపులు చేయగలుగుతారు. ఇప్పటివరకు చెల్లింపుల కోసం 4 లేదా 6 అంకెల పిన్‌ను నమోదు చేయాల్సి వచ్చేది. కానీ, చాలా మంది తమ పిన్ నంబర్ తరచూ మర్చిపోతారు లేదా పిన్ ఎవరికైనా తెలిస్తే మోసం చేసే అవకాశమూ ఉంది. అదీగాక వృద్ధులకు లేదా సాంకేతికత గురించి అంతగా తెలియని వారికి పిన్‌ను నమోదు చేయడం కష్టంగా అనిపిస్తుంది. ఈ సమస్యలన్నింటినీ అధిగమించడానికే బయోమెట్రిక్ ఫీచర్‌ను ప్రవేశపెడుతున్నారు.

## తగ్గిన ధరలకు బ్రేక్.. మళ్లీ లక్షదాటేసిన పసిడి ధరలు




బంగారం, వెండి ధరలు మళ్లీ సామాన్యులకు షాక్ ఇచ్చాయి. గత మూడు నాలుగు రోజులుగా తగ్గిన ధరలకు బ్రేక పడింది. ఈ నేపథ్యంలో జూలై 31న ఉదయం 6:10 గంటల సమయంలో, గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్‌లో బంగారం, వెండి ధరలు నిన్నటి రేట్లతో పోలిస్తే మళ్లీ పెరిగాయి.%24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.680 పెరిగి రూ.1,00,490కి చేరుకోగా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.92,110 స్థాయికి చేరింది. వెండి ధర కూడా కిలోగ్రాముకు రూ.1,200 పెరిగి రూ.1,17,100కి చేరుకుంది. ఈ ధరల పెరుగుదల భారతదేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా కనిపించింది.

## మార్కెట్ పైనా ట్రంప్ పిడుగు

### నష్టాల్లో భారత కంపెనీల ఏడీఆర్‌లు మూడేళ్ల కనిష్ఠానికి రూపాయి




తాజా సుంకాలు, పెనాల్టీలతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్ లాభాలకు బ్రేక్ పడే సూచనలు కనిపిస్తున్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ఆగస్టు 1 నుంచి 25 శాతం సుంకాలు, పెనాల్టీలు విధించబోతున్నట్టు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో గురువారం నిఫ్టీ 24,700 పాయింట్ల దిగువకు పడిపోయే అవకాశం ఉందని టెక్నికల్ విశ్లేషకుల అంచనా. ముఖ్యం గా ఆటోమొబైల్ విడిభాగాలు, టెక్స్‌టైల్స్, ఫార్మా, జువెలరీ, రొయ్యల ఎగుమతి కంపెనీల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు. గురువారం నాటి నిఫ్టీ ఓపెనింగ్‌కు సూచికగా భావించే గిఫ్ట్ నిఫ్టీ, ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే 24,700 పాయింట్ల దిగువకు పడిపోయింది. దీనికి తోడు గురువారం నాటి ఎఫ్ అండ్ ఓ సెటిల్‌మెంట్ భయాలూ మార్కెట్‌ను వెంటాడుతున్నాయి.నష్టాల్లో ఏడీఆర్‌లు: ట్రంప్ సుంకాల ప్రకటనతో అమెరికా స్టాక్ మార్కెట్‌లో భారత కంపెనీలు జారీ చేసిన ఏడీఆర్‌లూ నష్టాల్లోకి జారుకున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ (1.2్న), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (1.06్న), విప్రో (1.7్న), ఇన్ఫోసిస్ (0.78్న), డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ (3.83్న) ఏడీఆర్‌లు భారీగా నష్టపోయాయి.రూపాయి ధమాల్: డాలర్ మారకంలో రూపాయి విలువ మూడేళ్ల కనిష్ఠ స్థాయికి దిగజారింది. బుధవారం ఉదయం 19 పైసల నష్టంతో రూ.87.10 వద్ద ప్రారంభమైన రూపాయి చివరికి 89 పైసల నష్టంతో రూ.87.80 వద్ద ముగిసింది. ట్రంప్ ప్రకటనతో గురువారం రూపా యి మారకం రేటు మరింత పతనమయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. 'అమెరికా–భారత వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ఇంకా కొనసాగుతోంది. చమురు ?ధర కూడా పెరుగుతోంది. వీటికి తోడు ఎఫ్‌పీఐల అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీంతో డాలర్‌తో రూపాయి మారకం రేటు మరింత పతనమవుతుందని మా అంచ నా' అని మిరాసె అసెట్ షేర్‌ఖాన్ సంస్థ రీసెర్చి అనలిస్టు అనూజ్ చౌదరి చెప్పారు.

## జియో రూ 52000 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం సంస్థ రిలయన్స్ జియో సహా అన్ని డిజిటల్ సేవల విభాగమైన జియో ఇన్ఫోకామ్.. దలాల్‌స్ట్రీట్ చరిత్రలో అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌కు సిద్ధమవుతోంది. 5 శాతం వాటా విక్రయం ద్వారా 600 కోట్ల డాలర్ల (సుమారు రూ.52,200 కోట్లు) వరకు సమీకరించాలని జియో ఇన్ఫోకామ్ భావిస్తున్నట్లు బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది. ప్రస్తుతం మార్కెట్ చరిత్రలో అతిపెద్దదైన రూ.28,000 కోట్ల హ్యూండయ్ ఐపీఓతో పోలిస్తే జియో దాదాపు రెండింతల అధిక నిధులు సమీకరించనుందన్నమాట. ఐపీఓకు అనుమతి కోసం సెబీతో రిలయన్స్ ఇప్పటికే అనధికారిక చర్చలు కూడా ప్రారంభించినట్లు ఆ నివేదికలో తెలిపారు. సంస్థ వచ్చే ఏడాదిలో పబ్లిక్ ఇష్యూకు రావచ్చని సమాచారం.

## ఫార్చ్యూన్ గ్లోబల్ 500లో రిలయన్స్ 88వ స్థానం

న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను ప్రపంచంలోని 500 అతిపెద్ద కంపెనీల జాబితాను ప్రముఖ అమెరికన్ మ్యాగజైన్ ఫార్చ్యూన్ బుధవారం విడుదల చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఈ లిస్ట్‌లో 88వ స్థానం దక్కింది. గత ఏడాది 86వ స్థానంలో ఉండగా.. ఈసారి ర్యాంకింగ్ రెండు స్థానాలు జారుకుంది. 2021లో 155వ స్థానంలో నిలిచిన ఆర్ఐఎల్.. గడిచిన నాలుగేళ్లలో 67 స్థానాలు ఎగబాకింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006